అందెశ్రీ ఓ కోహినూర్ వజ్రం

- ఆ కుటుంబాన్ని ఆదుకునే బాధ్యత నాది
- ఆయన పేరిట స్మృతివనం నిర్మిస్తున్నాం
- 'నిప్పులవాగు' పుస్తకం ప్రతి గ్రంథాలయంలో ఉండేలా చేస్తాం
- తెలంగాణ పునర్నిర్మాణంలో దళితులు భాగస్వాములు కావాలి
- అందెశ్రీ సంతాపసభలో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఎన్ని వజ్రాలున్నా కోహినూర్ వజ్రానికి పోటీలేదు. కవులు, కళాకారులు ఎంత మంది ఉన్నా తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రం. ఆయన కీర్తిని భవిష్యత్‌లో నిలబెడతాం'అని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ సంతాపసభను శనివారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించింది. ముఖ్యఅతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అందెశ్రీ తనకు అత్యంత అప్తుడు, మనసుకు దగ్గరి వాడని అన్నారు. తెలంగాణ సమాజం చైతన్యవంతమైనదని చెప్పారు. ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుందన్నారు. రాచరికం, ఆధిపత్యం హద్దు మీరినప్పుడు కవులు, కళాకారులు తమ గొంగడి దుమ్ము దులిపి పోరాటంలోకి దూకారని అన్నారు. నిజాంకు వ్యతిరేకంగా 'బండెనక బండి కట్టి 16 బండ్లు కట్టి ఏ బండ్ల పోతవ్ కొడకో నైజాం సర్కరోడా' అని బండి యాదగిరి గళం విప్పితే నిజాం సర్కార్ పీఠం కదిలిందని గుర్తు చేశారు. సమైక్యవాదులకు వ్యతిరేకంగా గద్దర్, గోరేటి వెంకన్న, గూడ అంజన్న, అందెశ్రీ తెలంగాణ విముక్తి కోసం మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారని చెప్పారు. బడి మొహం చూడని అందెశ్రీ రాసిన జయజయహే తెలంగాణ గీతాన్ని రాసి స్ఫూర్తిని నింపారని అన్నారు. ప్రపంచంలో ఏ మూలన ఉన్నా ప్రతి తెలంగాణ గుండెకు తాకేలా ఈ పాటను రాసి ఉద్యమ స్ఫూర్తిని నింపారని వివరించారు. అందెశ్రీ లాంటి వారు లేకుండా తెలంగాణ ఉద్యమం జరగలేదనీ, ప్రత్యేక రాష్ట్ర సాధన కల సాకారం కాలేదని చెప్పారు. జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికార గీతంగా అందరూ భావించారని గుర్తు చేశారు. కానీ నాటి పాలకుల తీరు వల్ల జయజయహే తెలంగాణ పాట మూగబోయిందని అన్నారు. అధికారం శాశ్వతం అని నాటి పాలకులు భావించారని అన్నారు. తెలంగాణలో స్ఫూర్తిని నింపిన కవులు, కళాకారుల గానం తెలంగాణలో వినిపించకుండా కుట్ర చేశారని విమర్శించారు. పెన్నే కదా అని మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయనీ, గడీలను కుప్పకూల్చుతామని అందెశ్రీ నిరూపించారని చెప్పారు.

నేడు జయజయహే తెలంగాణ నిత్యగానం

ఇప్పుడు తెలంగాణ నాలుగుకోట్ల ప్రజలు జయజయహే తెలంగాణ పాటను నిత్యం పాడుకుంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. బడి మొహం చూడని అందెశ్రీ రాసిన ఆ పాటను ప్రతిబడిలో రోజూ పాడుతున్నారని వివరించారు. ఆ పాటను ప్రతి బడిలో వాడాలనీ, ప్రతి ఒక్కరూ పాడాలని చెప్పారు. తాను సీఎం, తన సహచర మంత్రులు అయ్యారంటే వారి స్ఫూర్తి ఎంతో ఉందన్నారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం తన బాధ్యత అని అన్నారు. ఆ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చామనీ, స్మృతివనం నిర్మిస్తున్నామని వివరించారు. ఆయన రాసిన 'నిప్పుల వాగు' పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాపాలన రావాలని గద్దర్, అందెశ్రీ కోరుకున్నారని అన్నారు.

మంత్రుల్లో రెడ్లు 20 శాతం దళితులు 27 శాతం

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తొమ్మిది కవులకు 300 గజాల ఇంటిస్థలం ఇచ్చామనీ, భారత్ ఫ్యూచర్ సిటీలో వారికి ఇంటిని నిర్మించి ఇస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. దేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు. సాంకేతిక, న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తకుండా అమలు చేస్తున్నామని వివరించారు. వర్గీకరణ అమలు వల్ల దళితుల్లో అత్యంత వెనుకబడిన వాళ్లు డాక్టర్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు అవుతున్నారని చెప్పారు. చిన్న ఉద్యోగాలకే పరిమితం కాకుండా భవిష్యత్‌లో ఐఏఎస్, ఐపీఎస్‌లుగా రాణించాలని ఆకాంక్షించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తన మంత్రివర్గంలో రెడ్లు ముగ్గురు మంత్రులుగా ఉంటే దళితులు నలుగురు ఉన్నారనీ, స్పీకర్ కూడా ఉన్నారని గుర్తు చేశారు. మంత్రుల్లో రెడ్లు 20 శాతం ఉంటే దళితులు 27 శాతం ఉన్నారని వివరించారు. దళితుల సమస్యలు, పరిశోధనలపై ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎస్సీ సంక్షేమ అభివృద్ధి శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ కోదండరామ్, మాజీమంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ ఎంపి వీహెచ్, గాయకురాలు విమలక్క, ఓయూ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ సి కాశీం, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, సాంస్కృతిక సారథి వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రపతి ముర్ముకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల రాష్ట్ర పర్యటన ముగిసింది. శనివారం ఆమె బేగంపేట్ విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి ఘనంగా వీడ్కోలు పలికారు.

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ ఒక గేమ్ చేంజర్

- మన పిల్లలు ప్రపంచంతో పోటీపడాలన్నదే లక్ష్యం
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఒక గేమ్ చేంజర్ అని, ఈ స్కూళ్లలో చదివే పిల్లలు ప్రపంచంతో పోటీపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఖమ్మం జిల్లా వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం శంకుస్థాపన చేశారు. ఒక్కో స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అధ్యక్షతన జరిగిన సభలో భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. ఈ స్కూళ్లలో ఉపాధ్యాయులు కూడా ఇక్కడే నివాసం ఉండేలా క్వార్టర్స్ నిర్మాణం జరుగుతుందన్నారు. వైరాలో ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి ఇప్పటికే రూ.30 కోట్లను కలెక్టర్ ఖాతాకు జమ చేసినట్టు తెలిపారు. గత ప్రభుత్వ 10 సంవత్సరాల కాలంలో ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ, కాస్మోటిక్ ఛార్జీలను పెంచలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం మెనూ 40 శాతం, కాస్మోటిక్స్ 200 శాతం పెంచిందని అన్నారు. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమని ప్రభుత్వం కృత నిశ్చయానికి వచ్చి ఈ స్కూళ్లను నిర్మిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరెలను ఇంటింటికీ వెళ్లి బొట్టుపెట్టి పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఎన్‌పిడిసిపిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, సిపి సునీల్ దత్, జిల్లా విద్యా శాఖాధికారి చైతన్య జైన్ తదితరులు పాల్గొన్నారు.

కోటి మంది మహిళలను.. కోటీశ్వరులను చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని, ప్రతి మహిళ మహిళా సంఘాల్లో చేరాలని మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. 'మహిళా ఉన్నతి - తెలంగాణ ప్రగతి' నినాదంతో మహిళలు వ్యాపార రంగంలో రాణించడానికి వడ్డీ లేని రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. శనివారం ములుగు జిల్లా ములుగు, వెంకటాపూర్, గోవిందరావు పేట, తాడ్వాయి మండలాల్లో జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలిసి మంత్రి సీతక్క మహిళా సంఘాలకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. అనంతరం ములుగు మండలంలో 370 మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంక్ లింకేజీ ద్వారా రూ.46.50 కోట్ల రుణాలు, 38మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, వెంకటాపూర్ మండలంలో 195 సంఘాలకు రూ. 26.50 కోట్ల రుణాలు, 43 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, గోవిందరావుపేట మండలంలో 283 సంఘాలకు రూ.29.865 కోట్ల రుణాలు, తాడ్వాయి మండలంలో 120 సంఘాలకు రూ.8 కోట్ల రుణాలు, 11మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారిని గౌరవించాలనే ఉద్దేశంతో సిఎం రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్నారని తెలిపారు.

వేడుకగా ఐఎంటి స్నాతకోత్సవం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఐఎంటి హైదరాబాద్ తమ 2023-2025 బ్యాచ్ కోసం స్నాతకోత్సవాన్ని తమ క్యాంపస్‌లో వేడుకగా నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వోల్వో గ్రూప్ ఇండియా అధ్యక్షుడు, ఎండి కమల్ బాలి పాల్గొనగా ఐఎంటి హైదరాబాద్ పిజిపి చైర్‌పర్సన్ ప్రొఫెసర్ స్టీవెన్ రాజ్ పడకండ్ల , ఐఎంటి హైదరాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ కె ఎం బహరుల్ ఇస్లాం తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఎంటి కొత్త సిఎస్ఆర్ కార్యక్రమం 'దైత్వ'ను ప్రొఫెసర్ కె ఎం బహరుల్ ఇస్లా, కమల్ బాలి పరిచయం చేయటంతో పాటుగా లోగోను ఆవిష్కరించారు. అనంతరం గ్రాడ్యుయేటింగ్ బ్యాచ్ కోసం కాన్వొకేషన్ సావనీర్‌లను విడుదల చేశారు. 2023-2025 బ్యాచ్‌లో అసాధారణ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 4 బంగారు పతకాలు, 3 వెండి పతకాలను ప్రదానం చేశారు.

తాటి, ఈత మొక్కల పెంపకానికి ముందుకు రావాలి

- రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర సదస్సులో మంత్రి మాట్లాడారు. మొక్కలు నాటేందుకు, వాటిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకెంతో గౌరవమని, ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టే విధంగా కృషి చేస్తానన్నారు. గీత కార్మికులు కులవృత్తి రక్షణతోపాటు వారి పిల్లల విద్యాభ్యాసానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో పిల్లలు నెగ్గేందుకు విద్య చాలా అవసరమని, వారిని చదివించాలన్నారు. రాష్ట్ర మంత్రిగా తనవంతు బాధ్యతగా గీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కుల పెద్దలతో కలిసి అమలయ్యే విధంగా చేద్దామన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, తాను కలిసి సిఎంతో మాట్లాడి ట్యాంక్‌బండ్ వద్ద సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఏర్పాటును త్వరలో చేపట్టనున్నట్టు చెప్పారు. ఏ విషయంలోనూ నిరాశ చెందొద్దని, ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కల్లు గీత వృత్తి ప్రధానమైందని, కొన్ని ప్రాంతాల్లో గౌడ కులస్థులే కాకుండా ఇతర కులాల వారూ కల్లు గీత వృత్తి చేస్తుండేవారన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం పార్టీలు, కులాలకు అతీతంగా గీత పనివారల సంఘం స్థాపించి, గీత వృత్తి రక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. గీత వృత్తి గ్రామీణ పరిశ్రమగా అభివృద్ధి చెందాలని సంఘం అనేక మార్గాలను ప్రభుత్వాలకు సూచించిందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మభిక్షం పేరును పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందని, కాలం మారిందని, కమ్యూనిస్టులు మరింత బలోపేతం కావాలంటే మరింత ఐక్యత అవసరమన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి డిజి సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, దూసరి శ్రీరాములు, పండ్ల రాములు, కార్యదర్శులు పబ్బారి దేవేందర్ గౌడ్, బొమ్మగాని శ్రీనివాస్, గౌడ్ సంఘం పాల్గొన్నారు.

ప్రమాదకర లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి : జాన్‌వెస్లీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మికులు దేశ వ్యాపితంగా సమ్మెలు చేస్తున్నా, కార్మిక సంఘాలతో ఎలాంటి చర్చలు లేకుండానే కేంద్రప్రభుత్వం ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్‌లను ఏకపక్షంగా ప్రకటించిందని విమర్శించారు. శనివారం నుంచే వాటి అమలుకు పూనుకున్నదని తెలిపారు. ఇది కార్మికుల హక్కులను కాలరాసే చర్య అని విమర్శించారు. ఆ కార్మిక చట్టాలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, త్యాగాలతో కార్మికులు తమ రక్షణ కోసం సాధించుకున్న 29 పాత చట్టాలకు కేంద్రం తిలోదకాలివ్వటం తగదని హితవు పలికారు. నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల వేతనాలు, పని గంటలు, సామాజిక భద్రత వంటి హక్కులకు భంగం కలుగుతున్నదని పేర్కొన్నారు. కార్మికులు సమ్మె చేసే హక్కును కోల్పోతారని తెలిపారు. కార్పొరేట్లకు అనుకూల విధానాలతో కార్మికుల హక్కులకు నష్టం కల్గించే కేంద్ర ప్రభుత్వ చర్యలకు నిరసనగా ఐక్య పోరాటాలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

యువతకు వృత్తినైపుణ్యాలపై ఫోకస్

- దానికోసం విద్యావ్యవస్థలో మార్పులు తెస్తాం
- జెఎన్‌టియుహెచ్ గ్లోబల్ అలూమ్ని మీట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యువతకు వృత్తినైపుణ్యాల్లో మెరుగైన శిక్షణ ఇచ్చేలా విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దేందుకు స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్-స్కిల్లింగ్‌పై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్‌పల్లిలోని జెఎన్‌టియుహెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'గ్లోబల్ అలూమ్ని మీట్ - 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్‌లో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. దానిలో భాగంగానే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్స్, గ్లోబల్ అలూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. యువ ఇంజనీర్ల ఆలోచనావిధానం మారాలనీ, ఉద్యోగార్థిగా కాకుండా పదిమందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మెన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ టీ కిషన్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కే వెంకటేశ్వరరావు, రెక్టార్ డాక్టర్ కే విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దమ్ముంటే నిరూపించు.. లేదంటే క్షమాపణ చెప్పు

మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి శ్రీధర్‌బాబు హెచ్చరిక

ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడంలో బీఆర్ఎస్ నాయకులు కే తారకరామారావు, టీ హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. ఈ మేరకు శనివారంనాడొక పత్రికాప్రకటన విడుదల చేశారు. విశ్వసనీయత లేని బిఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.ఐదు లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని, లేకుంటే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2023 ఆగస్టులో అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోలు19, 20, 21 వెనుక ఉన్న లక్షల కోట్ల మతలబు ఏంటని ప్రశ్నించారు. వారిచ్చిన జిఒల ప్రకారం రెగ్యులరైజ్ అయిన భూముల్లో జోన్ మార్పిడికి సంబంధించి విధించిన 50, 30 శాతం చార్జీలతో రాష్ట్ర ఖజానాకు రూ. 4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తున్నామన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

దావా సమన్లు
మహారాజశ్రీ గుంటూరు 4వ అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.693/2024

బిట్వీన్:
దొడ్డి నాగరాజు ...వాది
మరియు
నడింపల్లి సత్యవతి ... ప్రతివాది

టు,
నడింపల్లి సత్య వతి,భర్త.ఆనందరావు, నివాసం. ప్లాటు నెం.397, విష్ణుప్రియ నిలయం, రెడ్డిస్ ఎవెన్యూ, రాజధాని రోడ్డు, నిజాంపేట్, రంగా రెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీకు పై కోర్టు వారి నుండి ఎన్ని సార్లు దావా సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది.17-12-2025కి వాయిదా వేసినారు.కావున వాయిదా రోజు ఉ.గం.10-30ని.లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు.లేనిచో మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)

వాయిదా తేది:17-12-2025

బి.బాలాజీ చక్రవర్తి,
వాది తరపు అడ్వకేట్,
ఆర్.టి.సి.కాలనీ, గుంటూరు.

రేవంత్‌రెడ్డితో మధ్యప్రదేశ్ సిఎం భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డిని శనివారం హైదరాబాద్‌జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రేవంత్‌రెడ్డి వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీతోపాటు ప్రభుత్వం చేపడుతున్న ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి చెప్పారు. కాగా, ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆదివారం ఉదయం పుట్టపర్తికి వెళ్లనున్నారు. అక్కడ సాయి కుల్వంత్ హాల్‌లో నిర్వహించే శ్రీసత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొంటారు.

జాతీయ స్థాయికి ఈశాన్య రాష్ట్రాల్లోని క్రీడా ప్రతిభను తీసుకెళ్తాం

- మిజోరాం మంత్రి లాల్లింగ్‌లోనాహ్మర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఈశాన్య రాష్ట్రాల్లోని క్రీడా ప్రతిభను జాతీయ స్థాయికి తీసుకెళతామని మిజోరాం రాష్ట్ర యువజన సేవలు, క్రీడల శాఖ మంత్రి లాల్లింగ్‌లోనా హ్మర్ ఆశాభావం వ్యక్తం చేశారు. 'మిజోరం-ఫ్యూచర్ స్పోర్ట్స్ పవర్ హౌస్' ప్రత్యేకతను వివరించారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్ స్పోర్ట్స్ ఫెస్టివల్‌లో భాగంగా 'స్పిరిట్ ఆఫ్ ద గేమ్స్-కనెక్టింగ్ తెలంగాణ అండ్ నార్త్ ఈస్ట్' అనే అంశంపై చర్చాగోష్టి నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ తెలంగాణ రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బ్యాడ్మింటన్ స్టార్ పుల్లెల గోపీచంద్ తన అకాడమీ నిర్వహణ, ప్రతిభా వికాస విధానాలను చర్చించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఫుట్‌బాల్ స్టార్ బయ్‌చింగ్ భూటియా క్రీడా సంఘాలు, ప్రజల భాగస్వామ్యంపై ప్రాధాన్యతను వివరించారు. మణిపూర్ వెయిట్‌లిఫ్టింగ్ స్టార్, పద్మశ్రీ మీరాబాయి చాను క్రీడల్లో మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అంచనా వేసి, వాటి పరిష్కార దిశలో పలు సూచనలు చేశారు. అర్జున అవార్డు గ్రహీత బాక్సర్, ఎల్.సరితాదేవి క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కోచ్‌ల పాత్ర చాలా కీలకమైందన్నారు. త్రిపురకు చెందిన అర్జున అవార్డు గ్రహీత మంతు దేవనాద్ జిమ్నాస్టిక్స్ క్రీడాకారుల అభివృద్ధిలో అకాడమీల ప్రాధాన్యతను వివరించారు. క్రీడా జర్నలిస్టు ఇంద్రనీల్ దాస్ ఈశాన్య రాష్ట్రాల్లో క్రీడల వల్ల సంభవించిన సామాజిక మార్పులపై మాట్లాడారు. మణిపూర్ వెటరన్ జర్నలిస్టు ప్రదీప్ ఫాంజోభం చర్చాగోష్టి సమన్వయకర్తగా వ్యవహరించారు.

అంతర్జాతీయ స్థాయిలో 'గ్లోబల్ సమ్మిట్'

- ఫ్యూచర్ సిటిలో భారీ వేదిక
- దేశ, విదేశీ ప్రముఖులకు ఆహ్వానం
- 2047 డాక్యుమెంట్‌కు తుది మెరుగులు
- 25 నుంచి సిఎం రేవంత్‌రెడ్డి సమీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను 'రెండేండ్ల విజయోత్సవాలు'గా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సిఎంఒ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి శేషాద్రితో పాటు సిఎంఒ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేండ్లు పూర్తయిన నేపథ్యంలో విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అభిప్రాయపడ్డారు. డిసెంబర్ 8 తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలన్నారు. పండుగ వాతావరణాన్ని తలపించేలా ఫ్యూచర్ సిటీ వాతావరణం ఉండాలని స్పష్టం చేశారు. డిసెంబరు తొమ్మిదో తేదీ రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంటును ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పేలా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలను కండ్లకు కట్టించే ఆడియో, వీడియో ప్రదర్శనలు, ప్రజెంటేషన్లు తయారు చేసుకోవాలని సిఎం సూచించారు.

దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని అధికారులను ఆదేశించారు. వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని సిఎం ఆదేశించారు. ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని సూచించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్లో కీలకంగా పాల్పంచుకోవాలని ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్టు సిఎం ప్రకటించారు. అభివద్ధిలో కీలకమైన రంగాలు, అందులో పాల్పంచుకునే అనుసంధాన విభాగాలన్నింటితో ఒక్కో సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో ఆయా విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు.

ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందని సీఎం తెలిపారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షల్లో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని ప్రకటించారు.

HYPERSOFT TECHNOLOGIES LIMITED
CIN: L62010TG1983PLC003912
Registered Office: Unit 117, 1st Floor Techno-1 Sy. No. 86, 87(P), 88(P), 88/1, Raidurg, Serilingampally Mandal, Ranga Reddy, Madhapur, Hyderabad, Shaikpet, Telangana, India, 500081. **Website:** www.hypersoftindia.com
Email: info@hypersoftindia.com, **Ph:** 8143858084

వీడియో కాన్ఫరెన్సింగ్ (విసి / ఇతర ఆడియో విజువల్ మీన్స్ (ఒఎవిఎమ్) ద్వారా జరగనున్న కంపెనీ యొక్క అసాధారణ సాధారణ సమావేశం యొక్క నోటీసు

హైపర్‌సాఫ్ట్ టెక్నాలజీస్ లిమిటెడ్ ("కంపెనీ") వాటాదారుల యొక్క ఎక్స్‌ట్రా ఆర్డినరీ జనరల్ మీటింగ్ ('ఇజిఎమ్') డిసెంబర్ 20, 2025 శనివారం ఉదయం 11.00 గంటలకు (ఐఎస్‌టి) వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ('విసి')/ఇతర ఆడియో విజువల్ మీన్స్ ('ఒఏవిఎమ్') జరుగుతుందని సభ్యులకు ఇందుమూలంగా తెలియజేయబడుతోంది. కంపెనీల చట్టం, 2013 మరియు దాని కింద రూపొందించబడిన నియమాలు ('చట్టం') మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ అవసరాలు) నిబంధనలు, 2015, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ("ఎమ్‌జిఎ") మరియు సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా ("ఎస్ఇబిఐ") జారీ చేసిన ఈ అంశంపై వర్తించే అన్ని సర్క్యులర్‌లతో పాటు చదవబడుతుంది. ఇజిఎమ్ నోటీసులో పేర్కొన్న విధంగా వ్యాపారాన్ని నిర్వహించడానికి.
సభ్యులు విసి/ఒఎవిఎమ్ ద్వారా మాత్రమే ఇజిఎమ్‌కి హాజరు కాగలరు మరియు పాల్గొనగలరు. విసి/ఒఎవిఎమ్ ద్వారా ఇజిఎమ్ కి హాజరయ్యే సభ్యులను చట్టంలోని సెక్షన్ 103 ప్రకారం కోరం లెక్కించడానికి లెక్కిస్తారు.
ఈ విషయంపై ఎమ్‌సిఎ మరియు ఎస్ఇబిఐ జారీ చేసిన వర్తించే సర్క్యులర్‌లకు అనుగుణంగా, డిపాజిటరీ పార్టిసిపెంట్స్/రిజిస్ట్రార్ మరియు ట్రాన్స్‌ఫర్ ఏజెంట్/కంపెనీ వద్ద ఇమెయిల్ చిరునామాలు నమోదు చేసుకున్న సభ్యులందరికీ ఎలక్ట్రానిక్ విధానం ద్వారా మాత్రమే ఇజిఎమ్ నోటీసు పంపబడుతుంది. డీమెటీరియలైజ్డ్ మోడ్‌లో షేర్లను కలిగి ఉన్న సభ్యులు డిపి సూచించిన విధానాన్ని అనుసరించి వారి డిపాజిటరీ పార్టిసిపెంట్స్ ("డిపి") వద్ద వారి ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసుకోవాలని / నవీకరించాలని అభ్యర్థించబడింది.
కంపెనీ తన సభ్యులందరికీ రిమోట్ ఇ-ఓటింగ్ సౌకర్యం ('రిమోట్ ఇ-ఓటింగ్') అందించడానికి మరియు ఇజిఎమ్ సమయంలో ఇజిఎమ్ నోటీసులో పేర్కొన్న అన్ని తీర్మానాలపై ఓటు వేయడానికి ఇ-ఓటింగ్ వ్యవస్థ ద్వారా ఓటు వేసే సౌకర్యాన్ని అందించడానికి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ లిమిటెడ్ ("సిడిఎస్ఎల్") సేవలను నియమించింది.
(i) ఇమెయిల్ చిరునామాలను నమోదు చేయడం / నవీకరించడం వంటి వివరాలు, (ii) భౌతిక రూపంలో వాటాలను కలిగి ఉన్నవారు లేదా కంపెనీలో వారి ఇమెయిల్ చిరునామాలను నమోదు చేసుకోని వారు సహా సభ్యులకు రిమోట్ ఇ-ఓటింగ్/ఇ-ఓటింగ్ ద్వారా ఓటు వేయడంబీ మరియు (iii) ఇజిఎమ్ కు విసి / ఒఎవిఎమ్ ద్వారా హాజరు కావడానికి ఇజిఎమ్ నోటీసులో పేర్కొనబడింది, ఇది తగిన సమయంలో ఇమెయిల్ చేయబడుతుంది. ఇజిఎమ్ నోటీసులో పేర్కొన్న అన్ని గమనికలను (ఎలక్ట్రానిక్‌గా పంపబడుతుంది) మరియు ముఖ్యంగా ఇజిఎమ్‌లో చేరడానికి సూచనలు, రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా లేదా ఇజిఎమ్ వద్ద ఇ-ఓటింగ్ సౌకర్యం ద్వారా ఓటు వేసే విధానాన్ని సభ్యులు జాగ్రత్తగా చదవాలని అభ్యర్థించారు. ఇజిఎమ్ నోటీసు కంపెనీ వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచబడుతుంది: www.hypersoftindia.com మరియు స్టాక్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్, అంటే, బిఎస్ఇ లిమిటెడ్ వద్ద www.bseindia.com

For **Hypersoft Technologies Limited**
Sd/-
Manohar Reddy Pandi
Company Secretary and Compliance Officer
Membership No.: A35524

Place: Hyderabad
Date: 22nd November 2025

లేబర్ కోడ్‌లను తక్షణం ఉపసంహరించుకోవాలి

- కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఆ నాలుగు..
- మోడీ ప్రభుత్వ చర్య అప్రజాస్వామికం
- వీధి పోరాటాలకు సన్నద్ధం కావాల్సిందే..
- లేబర్ కోడ్‌ల ప్రతులు దహనం
- సిఐటియు నిరసన ర్యాలీలో ఎం సాయిబాబు, చుక్క రాములు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందనీ, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) అఖిల భారత కోశాధికారి ఎం సాయిబాబు డిమాండ్ చేశారు. దేశంలో 50కోట్ల కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా, వారికున్న హక్కులను హరించేందుకు మోడీ ప్రభుత్వం ఆ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. నాలుగు లేబర్‌కోడ్‌ల నోటిఫికేషన్‌కు నిరసనగా శనివారం హైదరాబాద్‌లో సిఐటియు ఆధ్వర్యంలో గోల్కొండ చౌరస్తా నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వరకు ర్యాలీ నిర్వహించారు. '8గంటల పనిదినం స్థానంలో 12గంటల పని వద్దు' 'కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు చేయాలి' 'కార్మిక చట్టాలను తుంగలో తొక్కి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల అమలు ఆపాలి' 'కార్మిక వ్యతిరేక మోడీ డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు.

అనంతరం సాయిబాబు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం చట్ట విరుద్ధంగా, అప్రస్వామికంగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో కార్పొరేట్లకు ఊడిగం చేసే విధంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో మంద బలం చూసుకుని తమ ఇష్టం వచ్చినట్టు చట్టాలను తీసుకొచ్చి కార్మికుల హక్కులను హరించాలని చూస్తే కార్మిక వర్గం ఊరుకోబోదని హెచ్చరించారు. దేశంలోని అన్ని కార్మిక సంఘాలను ఈ చట్టాలను వ్యతిరేకిస్తూ పోరాటాలు చేస్తున్నా..మోడీ ప్రభుత్వం కార్మికుల వాణిని ఖాతరు చేయకుండా మొండిగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యంలో కార్మికుల అభిప్రాయాలకు విలువ ఇవ్వకుండా వ్యవహరించడం తగదని చెప్పారు. బిజెపి ప్రభుత్వం ఏకపక్షంగా నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేసేందుకు పూనుకోవటవం శోచనీయమని విమర్శించారు. నవంబర్ 13న కార్మిక శాఖ మంత్రిని అన్ని కార్మిక సంఘాలు కలిసి ముక్త కంఠంతో నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలని రాత పూర్వకంగా కోరాయని గుర్తు చేశారు. ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దగ్గర కూడా ఇదే విషయాన్ని సంఘాలు చెప్పాయని తెలిపారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యాజమాన్యాలకు, కార్పొరేట్లకు గులాంగిరి చేసేందుకు పూనుకున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతంత్రానికి ముందు, ఆ తర్వాత కార్మికులు పొందుతున్న హక్కులపై మోడీ ప్రభుత్వం గొడ్డలి వేటు వేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల అభిప్రాయానికి విలువ ఇవ్వకపోతే..తమ పోరాటం క్షేత్ర స్థాయిలో ఉధృత పోరాటం నిర్వహించక తప్పదని స్పష్టం చేశారు. ఎక్కడైనా యాజమాన్యం కార్మికులను తొలగించినా, పరిశ్రమలను మూతేసినా, అప్రజాస్వామికంగా వ్యవహరించినా ఖబడ్దార్ మోడీ..కార్మికులు చేతులు ముడుచుకుని కూర్చోరని హెచ్చరించారు. పిడికిళ్లు బిగించి పోరాట రంగంలో దూకుతారని తెలిపారు. కార్మిక వర్గానికి మద్దతుగా రైతు, వ్యవసాయ కూలీ సంఘాలు ఈ నెల 26 దేశ వ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయని గుర్తు చేశారు. ఈ నిరసన కార్యక్రమం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు లక్షల కేంద్రాలలో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా బిజెపి ప్రభుత్వం ఆలోచించాలన్నారు. దేశానికి సంపద సృష్టిస్తున్న కార్మిక వర్గం కావాలా? శ్రమజీవుల కష్టాన్ని దోచుకుంటున్న కార్పొరేట్లు కావాలో తేల్చుకోవాలని హెచ్చరించారు. పార్లమెంట్, శాసన సభల్లో ఉన్న బలాలు శాశ్వతం కావనీ, ఈ దేశంలో కార్మిక వర్గమే శాశ్వతమని గుర్తు చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు వెనక్కి తీసుకునే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు మాట్లాడుతూ పారిశ్రామిక సంబంధాల కోడ్, ,సామాజిక భద్రతా కోడ్, వేతనాల కోడ్, వృత్తిపరమైన భద్రతా, ఆరోగ్యం పనిపరిస్థితుల కోడ్......ఇవన్నీ 29 కార్మిక చట్టాల స్థానంలో కార్మికుల ప్రయోజనాల కోసం తీసుకొస్తున్నామని ప్రభుత్వం నమ్మబలుకుతోందని చెప్పారు. కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ఈ కోడ్‌ల విషయంలో కొన్ని మీడియా సంస్థలు వాస్తవాలు వెల్లడించకుండా కప్పి పెడుతున్నాయనీ, మోడీని కీర్తిస్తున్నాయని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్‌లు అమలు కావట మంటే కార్మికుల ఉద్యోగ భద్రత గాలికెగిరిపోటమేనని చెప్పారు. భవిష్యత్‌లో పర్మినెంట్ ఉద్యోగాలుండబోవని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పుడు ఏ సంస్థ మూతపడతదో ఎవరమూ చెప్పలేమన్నారు. ఇప్పుడున్న పారిశ్రామిక వివాదాల చట్టం ప్రకారం వంద మందికంటే ఎక్కువ మంది కార్మికులున్న సంస్థలను ప్రభుత్వ అనుమతితో మూసివేయడం గానీ, కార్మికులను తీసివేయడం గాని చేయాలని పేర్కొన్నారు. కానీ..కొత్తగొచ్చిన ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ ప్రకారం వంద మంది కార్మికుల సంఖ్యను మూడు వందలకు చేశారని తెలిపారు. అంటే మూడు వందలకు తక్కువగా కార్మికులున్న సంస్థలను ఎప్పుడైనా యాజమాని మూసివేసేందుకు అవకాశం ఉందని, ఎప్పుడైనా కార్మికులను తొలగించేందుకు అవకాశం కల్పించిందని వివరించారు. ఇది హైర్ అండ్ ఫైర్ విధానం కాకపోతే మరేంటని ప్రశ్నించారు. శాశ్వత ఉద్యోగం లేకుండా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టాలు అవకాశాలు కల్పిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకోవాలని రేవంత్ సర్కార్‌కు సూచించారు. బిజెపికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సిఎం రేవంత్‌రెడ్డి దాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని కోరారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా తెలంగాణ ప్రభుత్వం కూడా తగిన నిర్ణయం తీసుకోవాలన్నారు. లేదంటే కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మరని చెప్పారు.

కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య, చంద్రశేఖర్, ఎం వెంకటేశ్, వీరారెడ్డి, కళ్యాణం వెంకటేశ్వర్లు, ఎజె రమేష్, ఎస్‌వి రమ, పద్మశ్రీ, పి జయలక్ష్మి, విఎస్‌రావు, ఒంగూరి రాములు, కూరపాటి రమేష్, ముత్యంరావు, పి శ్రీకాంత్, కె కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా..
సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతు పనులు

- డిసెంబర్ 1 నుంచి నీటిని ఖాళీ చేస్తాం
- విడతల వారీగా నీటి విడుదల : ఇరిగేషన్ ఇఎన్‌సి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగూరు ప్రాజెక్టు డ్యాం ప్రమాదంలో ఉందని, మరమ్మతుల కోసం ప్రభుత్వం నిపుణుల కమిటీ ఏర్పాటు చేసిందని ఇరిగేషన్ జనరల్ (ఇఎన్‌సి) అమ్జాద్ హుస్సేన్, మిషన్ భగీరథ ఇఎన్‌సి కృపాకర్ రెడ్డి తెలిపారు. శనివారం ఇరిగేషన్, మిషన్ భగీరథ, హెచ్ఎండబ్ల్యూఎస్ ఇఎన్‌సిలు సింగూరు ప్రాజెక్టును పరిశీలించి కట్ట డ్యామేజీ, కట్ట కుంగిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగూరు ప్రాజెక్టు డ్యామేజీ అయ్యింది వాస్తవమేనని అన్నారు. దీనిపై ఆధారపడి మిషన్ భగీరథ, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ సిస్టం నడుస్తుందని తెలిపారు. వాళ్లు పూర్తిగా దీనిపై ఆధారపడి ఉందని, కాబట్టి ఇబ్బందులు లేకుండా నిపుణుల కమిటీని ప్రభుత్వం వేసిందన్నారు. ఇరిగేషన్, హైదరాబాద్ మెట్రో వాటర్, ఇఎన్‌సి కలిసి ప్రాజెక్టును పరిశీలించినట్టు తెలిపారు. నీటి కెపాసిటీకి తగ్గట్టు డ్యాం డ్యామేజీ పరిశీలన చేస్తూ ఎక్కడి వరకు ప్రాజెక్టు డ్యామేజీ అయ్యిందో తెలుసుకుంటామని, తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా డ్యాం డ్యామేజీ ఎంత వరకు అయ్యిందో ఆ మేరకు మరమ్మతులు చేపడతామని వివరించారు. మొదటగా ప్రభుత్వ అనుమతి తీసుకుని మూడు శాఖలు సమన్వయంతో డ్యాంను రిపేర్ చేస్తూ విడతల వారీగా పనులు కొనసాగిస్తూ మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. మరో 50 సంవత్సరాల వరకు ప్రాజెక్టుకు రిపేర్లు రాకుండా చర్యలు తీసుకుంటూ పనులను చేపడతామని, ప్రాజెక్టు కింది భాగం నుంచి రిపేర్ చేస్తామని, పై భాగం నుంచి రిపేర్ చేస్తే కట్ట పాడైపోయే అవకాశం ఉంటుందన్నారు. ప్రాజెక్టు కింద భాగం ఎంత వరకు గట్టిగా ఉందో పరిశీలించి అక్కడి నుంచి ప్రాజెక్టు రిపేర్ చేయాల్సి ఉంటుందని, మరమ్మతులు చేస్తున్న సందర్భంగా రైతులకు సాగుకు, ప్రజలకు తాగుకు నీటి ఇబ్బందులు లేకుండా పనులు చేపడతామని తెలిపారు. మూడు శాఖలు మిషన్ భగీరథ, ఇరిగేషన్, వాటర్ వర్క్స్ శాఖలు సమన్వయంతో పని చేస్తూ ఎప్పటికప్పుడు జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేస్తూ పనులు కొనసాగిస్తామన్నారు.

డిసెంబర్ 1 నుంచి ప్రాజెక్టు పనులు ప్రారంభిస్తాం..

డిసెంబర్ 1వ తేదీ నుంచి పనులు ప్రారంభించి జూన్ నెల వరకు పనులు పూర్తి చేయాలని ప్రణాళిక రూపొందించినట్టు అధికారులు తెలిపారు. ఈ పనుల కోసం టెండర్లు పూర్తి అయ్యాయన్నారు. నీటి ఇబ్బందులు రాకుండా ప్రాజెక్టు డ్యామేజీ అంచనా వేసి పనులు ప్రారంభించాలని ఆగామని, రిపేర్ల కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే అగ్రిమెంట్ చేసి పనులను ప్రారంభిస్తామన్నారు. సింగూరు పూర్తి కెపాసిటీ 29.9 టిఎంసిలు ఉండగా కట్ట బలహీనంగా ఉండటంతో ప్రస్తుతం 16.5 టిఎంసిలు నిల్వ ఉంచినట్టు వివరించారు. బర్మ్ లెవల్ 518 ఉంటుంది. అక్కడ కూడా తొమ్మిది టిఎంసిల నీరు నిలువ ఉంటుందన్నారు. అక్కడి వరకు నీటిని విడుదల చేసి డ్యాం డ్యామేజీని అంచనా వేస్తామని, సింగూరు ప్రాజెక్టు కట్ట నాలుగు ప్లేస్‌లలో డ్యామేజీ అయ్యిందన్నారు. కట్ట 800 మీటర్లు కంప్లీట్ జారీ పోయిందని, అదే విధంగా కట్ట మొత్తం 6.5 కిలోమీటర్లు మొత్తం కుంగిపోయిందని తెలిపారు. ప్రస్తుతానికి కట్టకు ఎలాంటి ప్రమాదం లేదని అన్నారు. అలాగే, ప్రాజెక్టు నుంచి రైతులకు సాగుకు నీరిచ్చే కాలువకు రిపేర్ చేస్తామని, ఆ పనులు కూడా వీటితో పాటు ప్రారంభిస్తామని తెలిపారు. సింగూరు కెనాల్ నుంచి 40వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందిస్తామని, వారికి సరఫరా చేసేందుకు పంపింగ్ ద్వారా నీటిని అందించవచ్చున్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని విడతల వారిగా నీటిని విడుదల చేసి ప్రాజెక్టును రిపేర్ చేస్తామని తెలిపారు. ప్రాజెక్టును పరిశీలించిన వారిలో హెచ్ఎండబ్ల్యూఎస్ టెక్నికల్ డైరెక్టర్ సుదర్శన్, డిజైన్ చీఫ్ ఇంజనీర్ సత్యనారాయణ రెడ్డి, హెచ్ఎండబ్ల్యూఎస్ సీజీఎం బ్రిజేష్, సంగారెడ్డి చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్ఈ పోచమల్లు ఉన్నారు.

అసిస్టెంట్ పైలట్‌పై
పైలట్ లైంగిక దాడికి యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ ఏవియేషన్ సంస్థలో కమర్షియల్ అసిస్టెంట్ పైలట్‌గా పనిచేస్తున్న యువతిపై అదే సంస్థలో పనిచేస్తున్న మరో కమర్షియల్ పైలట్ లైంగికదాడికి యత్నించిన ఘటన చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ బేగంపేటలోని ఓ ఏవియేషన్ సంస్థలో బాధితురాలు, నిందితుడు రోహిత్ శరణ్ పనిచేస్తున్నారు. ఒక పని విషయంలో ఇటీవల వారు కర్నాటకలోని బెంగళూరుకు వెళ్లారు. అక్కడ హోటల్ గదిలో ఆమెతో రోహిత్ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా తాకరాని చోట తాకుతూ లైంగికదాడికి యత్నించాడు. ప్రతిఘటించిన ఆమె అక్కడి నుంచి పారిపోయి హైదరాబాద్ వచ్చింది. అనంతరం సదరు పైలట్‌పై బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును ఘటన చోటు చేసుకున్న ప్రాంతం కర్నాటకలోని హలసూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

చుక్కా రామయ్యకు జాన్‌వెస్లీ పుట్టినరోజు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చుక్కా రామయ్య

తెలంగాణ రైతాంగ సాయుధపోరాట యోధులు, ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త చుక్కా రామయ్యను శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే 100వ పుట్టినరోజు జరుపుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి అహర్నిశలు పనిచేసిన వ్యక్తి చుక్కా రామయ్య అని అన్నారు. ఆయన సేవలు యువతకు స్ఫూర్తిదాయకమని తెలిపారు. విద్యారంగానికి ఆయన చేసిన సేవలు అపారమైనవవని, ఉన్నతమైన విద్యను గ్రామీణ విద్యార్థులకు చేరవేసేందుకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐఐటీ పూర్తి చేసి ప్రపంచ దేశాల్లో స్థిరపడిన ఎంతో మంది యువతకు కారణం చుక్కా రామయ్య అని తెలిపారు. ఆయన విద్యాప్రదాతే కాకుండా తెలంగాణ పోరాటంలో, రాజకీయాల్లో దిక్సూచిగా తన పాత్రను పోషించారని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రాంగారెడ్డి, మల్లు లక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.బాబురావు, అరుణజ్యోతి, సరళ, శ్రీరాం నాయక్ తదితరులు ఉన్నారు.

ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగింపు

- రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్ చౌరస్తాలో చర్యలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఆరాంఘర్ చౌరస్తాలో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి నిర్మించిన షెడ్లను, డబ్బాలను శనివారం అధికారులు కూల్చివేశారు. రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఎసిపి శ్రీధర్ ఆధ్వర్యంలో కూల్చివేతలు చేపట్టారు. ఏసీపీ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ఫుట్‌పాత్ ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల వల్ల కొంతకాలంగా ఇక్కడ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతుందని స్థానికులు పలుమార్లు జిహెచ్ఎంసి, ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో ఉదయం ఆరు గంటల నుంచి శివరాంపల్లి నుంచి ఆరాంఘర్ చౌరస్తా వరకు రోడ్డుకి ఇరువైపులా ఫుట్‌పాత్‌ను ఆక్రమించి నిర్మించిన కట్టడాలన్నీ కూల్చివేశారు. శివరాంపల్లిలో కూల్చివేతను స్థానికులు అడ్డుకున్నారు. కొద్దిసేపు అక్కడ స్థానికులకు, అధికారులకు వాగ్వివాదం చోటుచేసుకుంది. అడ్డుకుంటున్న వారిని పోలీసులు అక్కడి నుంచి పంపించారు. అనంతరం ఫుట్‌పాత్‌పై నిర్మించిన అన్ని కట్టాడాలను జేసీబీల సాయంతో వరుసగా అధికారులు కూల్చివేశారు. ఎట్టకేలకు అధికారులు ఈ ఆక్రమణలకు తొలగించడం పట్ల వాహనదారులు సంతోషం వ్యక్తం చేశారు. కూల్చివేసిన చోట మళ్లీ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

ఆ కోడ్‌లు శ్రామికులకు మరణ శాసనం
మోడీ ప్రభుత్వం మహిళలకు చీకటి రోజులు తెచ్చింది

- 26న దేశవ్యాప్త నిరసనలు
- రాష్ట్రంలో నేడు, రేపు నిరసన కార్యక్రమాలు : బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

నాలుగు లేబర్ కోడ్ లను నోటిఫై చేస్తూ... అన్ని రాష్ట్రాలు తక్షణం వాటిని అమల్లోకి తీసుకురావాలని కేంద్ర ప్రకటించటం ఈ చర్య శ్రామికులకు, కార్మికులకు మరణ శాసనం లాంటిదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి నాగయ్య, ఆర్ వెంకట్రాములుతో కలిసి వెంకట్ విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ కూలీలకు ఇది చీకటి రోజని ఆందోళన వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో ఎక్కువ మంది మహిళలుంటారని గుర్తు చేశారు. ఆనందంగా కార్తీక మాసాన్ని ముగించుకున్న మహిళలకు మోడీ ప్రభుత్వం చీకటి రోజులు మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక, ప్రజావ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఈ నెల 26 నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. లేబర్ కోడ్‌లోని ఒకటి రెండు మంచి అంశాలనే హైలెట్ చేసి మిడియా ప్రచారం చేస్తున్నదనీ, కార్మికులకు నష్టం తీసుకొచ్చే 90శాతం అంశాలను తద్వారా కార్మికులకు జరుగుతున్న వినాశనాన్ని వెలుగులోకి రాకుండా కప్పిపెడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏండ్లుగా పోరాటాలు నిర్వహించి, త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాల అంతఃసారాన్ని నాలుగు లేబర్‌కోడ్‌లుగా తీసుకొచ్చి, కార్పొరేట్లకు, భూస్వాములకు ఊడిగం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరింత ముందుకు పోతున్నదని విమర్శించారు. ఉత్పత్తి, పరిస్థితుల్లో మార్పులొచ్చినప్పుడు అందుకనుగుణంగా చట్టాలను సానుకూలంగా మార్చాలని చెప్పారు. మోడీ చెప్పినట్టు కార్మికులు పండుగ చేసుకునేటట్టు చట్టాలు లేవని తెలిపారు. అవి యజమానులకు అనుకూలంగా ఉన్నాయని వివరించారు. మరీ ముఖ్యంగా వ్యవసాయ కార్మికులకు వినాశనకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాలు నిర్ణయించే అంశాన్ని యాజమాన్యాలకు వదిలేయటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. యూనియన్ పెట్టుకునేహక్కుకు అంటాకాలను కల్పించే విధంగా కోడ్‌లో మార్పు చేశారని తెలిపారు. వలస కార్మికులను గుర్తించేందుకు సంఖ్యను పెంచి.. అంతా మంచి చేస్తున్నామంటూ బిల్డప్ ఇవ్వటం మానుకోవాలని హెచ్చరించారు. పని గంటలను యాజమాన్యాలు ఇష్టానుసారంగా పెంచుకునేందుకు అందులో అవకాశం కల్పించలేదా? అని ప్రశ్నించారు. అదనపు గంటలు పని చేసి అదనపు వేతనం పొందొచ్చని చెప్పే కాకమ్మ కబుర్లు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు పలికారు. చట్టాల పేరుతో పనిగంటలు పెంచి, కొత్త తరహా బానిస వ్యవస్థను తీసుకొస్తున్నారని విమర్శించారు. ఈ నాలుగు కోడ్‌లు వెట్టిచేసే బానిసలుగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గిగ్, ప్లాట్‌ఫారమ్ వర్కర్లకు కనీస టైం బౌండ్ ఉండాలని చెప్పటమంటేనే ఆ కోడ్‌లు కార్మికులకు ఎట్లాంటి ప్రయోజనం చేకూరుస్తాయో అర్థం చేసుకోవచ్చన్నారు. సంఘటిత, అసంఘటిత కార్మికులకే ఇవి వినాశనంగా ఉంటే..అసలు వ్యవసాయ కార్మికులకు ఎలాంటి హక్కులుండబోవని తెలిపారు. వారు చేస్తున్న పనులన్నీ, వంగి చేసే పనులు కాబట్టి అనారోగ్యాలకు గురవుతున్నారని ఆందోళన జరగుతుంటే..ఎక్కువ గంటలు పనిచేయాలని చెప్పటం ఎలాంటి నీతో చెప్పాలని నిలదీశారు. ఇందులో మహిళలకు రక్షణ లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏ మాత్రం సామాజిక దృక్పథం ఉన్నా..కనీస వేతనం రూ.24వేలు నిర్ణయించి, వాటిని అమలు చేసేందుకు చట్టాలు చేసి నిరూపించుకోవాలని కోరారు. ఇప్పటికే దేశంలో సామాజిక వివక్ష విలయతాండవం చేస్తున్నదని తెలిపారు. అసంఘటిత రంగంలో పనిచేసేవారంతా దళితులు, గిరిజనులు, బీసీలు, ఎంబీసీలేనని చెప్పారు. వ్యవసాయ కార్మికుల్లో 49శాతం దళితులు, మరికొన్ని రాష్ట్రాల్లో 70శాతం దళితులు, గిరిజనులు ఎంబీసీలున్నారని తెలిపారు. ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని చట్టం చేస్తే..సామాజిక భద్రతకు అర్థం ఉంటుందన్నారు. ప్రభుత్వం మాటలు ఎన్ని చెబుతున్నప్పటికీ కార్పొరేట్, ధనికులకు, నూతనంగా అభివృద్ధి అవుతున్న కార్పొరేట్ వ్యవసాయ శక్తులకు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. ఉపాధి పనికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నందున ఆది, సోమవారాల్లో దేశవ్యాప్తంగా ఉపాధి హామీ పని ప్రదేశాల్లో నాలుగు లేబర్‌కోడ్‌లను దహనం చేయాలని పిలుపునిచ్చారు.

లేబర్ కోడ్‌ల బిల్లులు దహనం చేయాలి..

కార్మికులకు, కూలీలకు నష్టం తీసుకొచ్చే నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులు పోరాటాలకు సన్నద్ధం కావాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు పిలుపునిచ్చారు. ఆది, సోమవారాల్లో లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేయాలని కోరారు. ఇప్పటికే అనేక పోరాటాలు నిర్వహించామనీ, అయినా ప్రభుత్వం ప్రజల పట్ల మొండిగా వ్యవహరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

మావోయిస్టు హిడ్మా ఎన్‌కౌంటర్ బూటకం

- తెలంగాణ పౌర హక్కుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మారేడుమిల్లిలో ఈ నెల 18న జరిగిన హిడ్మా ఎన్‌కౌంటర్ ఒక బూటకమని తెలంగాణ పౌర హక్కుల సంఘం తెలిపింది. శనివారం హైదరాబాద్ హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మడివి హిడ్మాతో పాటు మరో ఐదుగురిని భద్రతా బలగాలు హత్య చేశాయని ఆరోపించారు. ఆదివాసీ నాయకులు హిడ్మాను పోలీసులు నిర్బంధించి, చిత్రహింసలకు గురి చేశారని, అదుపులో ఉన్న ఆయనను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టకుండా ఎలా ఎన్‌కౌంటర్ చేస్తారని ప్రశ్నించారు. నిజనిర్ధారణ కోసం ఏపీకి వెళ్తే తమను అక్కడి ప్రభుత్వం అనుమతించడం లేదన్నారు. కార్యదర్శి నారాయణరావు మాట్లాడుతూ.. గత 22 నెలలుగా ఆపరేషన్ కగార్ పేరుతో 84 బూటకపు ఎన్‌కౌంటర్‌లలో 780 మందిని కేంద్ర ప్రభుత్వం హత్య చేసిందన్నారు. రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని పౌర సమాజం ఖండించాలన్నారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి, ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

29న దీక్షా దివస్‌ను నిర్వహించండి

- బిఆర్ఎస్ శ్రేణులకు కెటిఆర్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల 29న 'దీక్షా దివస్'ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట కెటిఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. 16 ఏళ్ల క్రితం, పార్టీ అధినేత కెసిఆర్ 'తెలంగాణ వచ్చుడో... కెసిఆర్ సచ్చుడో' అనే గొప్ప త్యాగనిరతితో దీక్షను చేపట్టి, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నారని పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రలో ఈ గొప్ప ఘట్టాన్ని పురస్కరించుకుని 'దీక్షా దివస్'ను పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జిల్లాల అధ్యక్షులు, పార్టీ నాయకులతో కేటీఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దీక్షా దివస్ నిర్వహణకు సంబంధించిన మార్గదర్శనం చేశారు. ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశాలను నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాలకు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్లతోసహా ఇతర కీలక నాయకులు హాజరు కావాలని కోరారు. ఈనెల 29న నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ జిల్లా కార్యాలయాల్లోనే నిర్వహించాలన్నారు. ఈనెల 28న సాయంత్రంలోగా జిల్లా కేంద్రాలు, పట్టణాలను బ్యానర్లు, ఫ్లెక్సీలతో అలంకరణ పూర్తి చేయాలన్నారు. పార్టీ కార్యాలయం ప్రాంగణాన్ని కూడా సుందరంగా అలంకరించాలని సూచించారు. మొదట తెలంగాణ తల్లికి, అమరవీరుల స్థూపానికి నివాళులర్పించాలని కోరారు. ఆ తర్వాత, కార్యక్రమం ప్రారంభానికి గుర్తుగా కేసీఆర్ భారీ కటౌట్‌కు పాలాభిషేకం చేయాలన్నారు. దీక్షా దివస్ సందర్భంగా జరిగిన అనేక కీలక సంఘటనలు, వార్తలు, పరిణామాల సమాహారంతో కూడిన ఫోటో ప్రదర్శనను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ ఫోటోలను పార్టీ కేంద్ర కార్యాలయం జిల్లాలకు పంపిస్తుందనీ, వీటితోపాటు, స్థానిక జిల్లాల్లో దీక్షా దివస్ సందర్భంగా జరిగిన సంఘటనల ఫోటోలు, వార్తా కవరేజ్ క్లిప్పింగ్‌లతో మరొక ఉపవిభాగాన్ని కూడా ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. కేవలం రాజకీయ ఉపన్యాసాలు కాకుండా, ఆనాటి ఉద్యమ స్మృతులను, ముఖ్యంగా దీక్షా దివస్ వివరాలను అందించేలా మాట్లాడే వక్తలను ఆహ్వానించాలన్నారు. వారి సమయాన్ని ఇప్పుడే నిర్ధారించుకోవాలని సూచించారు. ఆ రోజు పండ్ల పంపిణీ, వీలుంటే అన్నదానం లాంటి సామాజిక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌లో ప్రత్యేకంగా పండ్ల పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే, యూత్, విద్యార్థి విభాగం తరఫున ప్రతి యూనివర్సిటీల్లో దీక్షా దివస్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

నీటి సంరక్షణతోనే భవిష్యత్

- పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన సంగారెడ్డి జిల్లా
- తాగునీటి కొరతకు శాశ్వత పరిష్కారం
- ప్రతి ఇంటికీ ఇంకుడు గుంతలు నిర్మించేలా ప్రణాళిక
- పది గ్రామాలకు రూ.48 కోట్లు కేటాయింపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మానవజాతి మనుగడకు ప్రకృతి వనరైన నీరే ప్రధానం. నీటి సంరక్షణపైనే భవిష్యత్ ఆధారపడి ఉంది. నీరు పుష్కలంగా లభిస్తున్న ప్రాంతాలు అభివృద్ధి పరంగా ముందు వరుసలో ఉంటాయి. తాగునీరు, సాగునీరు ప్రస్తుతం పుష్కలంగా లభిస్తున్నప్పటికీ నీటి వృథా కారణంగా సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం నీటి నిల్వ ప్రాధాన్యతను ప్రజలకు వివరించడం కోసం.. గ్రామాల్లో వాటర్‌షెడ్‌లు ఏర్పాటు చేసి నీటి నిల్వల పెంపుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా సంగారెడ్డి జిల్లా పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఈ సందర్భంగా నీటి కొరత ఉన్న 10 గ్రామాలను అధికారులు ఎంపిక చేశారు. ఆ గ్రామాల్లో వాటర్ షెడ్‌లను ఏర్పాటు చేయడం, ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత నిర్మాణం చేపడతారు. ఎంపికైన 10 గ్రామాల్లో నీటి నిల్వ పెంచేందుకు ప్రభుత్వం రూ.48 కోట్ల నిధులను కేటాయించింది. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవడంతో నీటిని అందులోకి మళ్లించడం, గ్రామంలోని మురుగు కాలువల నీటిని పెద్దపెద్ద ఇంకుడు గుంతల్లోకి పంపి భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెంపొందించొచ్చు.

ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం..

తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారాలు కనుగొనడం, ఆధునిక నీటి సంరక్షణ టెక్నాలజీని ప్రజలకు చేరవేయడం, వర్షపు నీటి నిల్వ వ్యవస్థలను గ్రామ స్థాయిలో ఏర్పాటు చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వ్యవసాయ భూభాగాల్లో మైక్రో-ఇరిగేషన్ (డ్రిప్/స్ప్రింక్లర్) వినియోగాన్ని పెంచడం, గ్రామంలోని 340 ఇండ్లల్లో వర్షపు నీటి సంరక్షణ పిట్‌లు ఏర్పాటు చేయడం, పాఠశాలలో నీటి ఆదా క్లబ్, చెరువుల పునరుద్ధరణ వంటివి చేపడతారు. నీటి సంరక్షణకు దేశవ్యాప్త పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సంగారెడ్డి జిల్లాలో మల్క్యాపూర్, గుంతపల్లి, హరిదాస్ పూర్, బాచుపల్లి, మన్సాన్‌పల్లి, గొల్లపల్లి, మారేపల్లి, కొండాపూర్, మహమ్మదాపూర్, ఆందోల్ గ్రామాలను ఎంపిక చేశారు.

నీటి సంరక్షణపై అధికారులకు శిక్షణ..

సంగారెడ్డి జిల్లాలో నీటి సంరక్షణ ప్రాజెక్టులో భాగంగా ఎంపికైన 10 గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపిఒ, ఎంపిడిఒలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ అవగాహన సమావేశంలో నీటి సంరక్షణ, వర్షపు నీరు నిలువ, వీటిని పొదుపుగా వినియోగించడం, ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించారు.

నీటి సంరక్షణపై భవిష్యత్ ఆధారపడి ఉంది

చంద్రశేఖర్, అదనపు కలెక్టర్

నీటి సంరక్షణ మీదనే భవిష్యత్ ఆధారపడి ఉంది. అందులో భాగంగా వాటర్ హెడ్ ఆధ్వర్యంలో నీటి సంరక్షణ, సుస్థిరమైన నీటి భవిష్యత్ కోసం సంఘాలను సాధికారపరచడంపై జిల్లాలో ఎంపిక చేసిన పది గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవో, ఎంపీడీవోలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు అవగాహన కల్పించాం. ఈ ప్రాజెక్టు కింద మన ఊరిలో, మన ఇంట్లో కురిసిన ప్రతి వర్షపు చినుకు మనదే. మన ఇంటి ఆవరణలో, మన ఊరి ఆవరణలో వాటిని భూమిలోకి ఇంకెలా చేయడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. నీటి వృథాను సాధ్యమైనంత వరకు తగ్గించాలి. ఎంపిక చేసిన పది గ్రామాల్లో ప్రభుత్వ విద్యాసంస్థలు, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో నీటి వసతి కల్పించడం, నీటి వృథాను అరికట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తాం.